క్లుప్తంగా

నేటి నుంచి నాటక ప్రదర్శన

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో బుధవారం నుంచి విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన ఉంటుందని సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాటకాలు కనుమరుగు కాకుండా తమ గ్రామంలో దాతల సహకారంతో బ్రహ్మంగారి నాటక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13 వరకు జరిగే నాటక ప్రదర్శనను తిలకించేందుకు గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు తరలిరావాలని కోరారు.

15న మండల స్థాయి టోర్నమెంట్



దామరగిద్ద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ టోర్నమెంట్‌ను ఈ నెల 15 తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీపీ నర్సప్ప, ఎంపీడీఓ రమణ, పీఈటీ వెంకటప్ప తెలిపారు. ఖోఖో, వాలీబాల్, 100 మీటర్ల పరుగు పందెం, 400 మీటర్ల పరుగు పందెం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వివిధ గ్రామాల క్రీడాకారులు సీఎం కప్ టోర్నమెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బసంత్‌రెడ్డి, ఏఎస్‌ఐ అరుణ్, తిప్పణ్ణ, కన్కిరెడ్డి, భీంరెడ్డి, నర్సిములు, అంజి పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



మరికల్: మండలంలోని రాకొండలో ఊకచెట్టు వాగులోకి ఈతకు వెళ్లి మృతి చెందిన బాలికల బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా బీఆర్ఎస్ నాయకులు రాజవర్ధన్‌రెడ్డి అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, కృష్ణారెడ్డి, గాదం మల్లేష్, సంపత్, నరహరి, రాజేశ్వర్‌రెడ్డి, వెంకట్రాములు పాల్గొన్నారు.

'ఓటర్ల జాబితాను సరిచేయాలి'

దామరగిద్ద: ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు వంటి వాటిపై ఇంటింటి సర్వే ద్వారా బీఎల్‌ఓలు జాబితాను సరిదిద్దాలని తహసీల్దార్ ప్రమీల అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, స్థానిక ప్రజా ప్రతినిధులకు ఓటర్ల జాబితాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేర్లు, ఇంటి నెంబర్లు, పుట్టిన తేదీ వంటి సర్దుబాట్లు, ఓటర్ల జాబితాలో పేర్ల బదిలీ, వంటి వాటిని ఫాం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరణించిన వారి పేర్ల తొలగింపునకు ఫాం–7, కొత్త వారిని ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫాం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

ఎల్లమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



దామరగిద్ద: మండల కేంద్రంలో వెలిసిన కట్టమీది ఎల్లమ్మ దేవత నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభించారు. సర్పంచ్ ఆశమ్మ సమక్షంలో వేదపండితులు మంత్రోచ్చరణ మధ్య పూజలు చేపట్టారు. మంగళ, బుధవారాలు ప్రత్యేక పూజలు జలాదివాసం ధాన్యాదివాసం, పూజల అనంతరం శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన చేపడుతున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రకాంత్, గజలప్ప, నారాయణ పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడుదాం

నారాయణపేట టౌన్: 'ఉపాధి' కూలీల హక్కుల కోసం పోరాడుదామని వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. మండలంలోని అమ్మిరెడ్డిపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజుకు రూ.600లు ఇవ్వాలని, కూలీలకు టెంట్లు ఇతర వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర నాయకులు అంజి, రాములు, బాలకృష్ణ, గోవింద్, నర్సింహులు, రామప్ప పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రభుత్వ విద్యార్థుల హవా


రేణుకు (942) బైపీసీ


మోహన్ (950) (బైపీసీ)


ముభాషీరా (933) (సీఈసీ-ఉర్దూ మీడియం)


ఈడ్గి రేణుక (952) సీఈసీ


మహ్మద్ దావుద్ (906)


స్వప్న (938)


తరుణ్ (932)


అంకిత 836


ప్రకృతి 857

విద్యార్థులను అభినందించిన యాజమాన్యం


నికిత


కోమల్


నితిన్

మక్తల్: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండల కేంద్రంలోని బీసీ గురుకుల కాలేజీ మొదటి సంవత్సరంలో 21 మంది, ద్వితీయ సంవత్సరంలో 38 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు 60 మంది ఉత్తీర్ణులయ్యారు.

మద్దూరు: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మద్దూరు జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో కె. రేణుక (బైపీసీ)లో 942 మార్కులు సాధించి కాలేజీ టాపర్‌గా నిలిచింది. సీఈసీలో కె. రుక్మిణి 916 మార్కులు, ఎంపీసీలో ఎం. రాణి 849 మార్కులు సాధించారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో సీఈసీలో బి. అనిల్ 500 మార్కులకు గాను 417, బైపీసీలో కె. అనురాధ 440 మార్కులకు గాను 374, ఎంపీసీలో అనిత 378 మార్కులు సాధించారు.

కోస్గి: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎంపీసీలో సౌజన్య 962 మార్కులు, బైపీసీలో మోహన్ 950 మార్కులు, సీఈసీలో మమత 912 మార్కులు, ఉర్దూ మీడియం సీఈసీలో ముభాషీరా 933 మార్కులతో ప్రతిభ చాటారు.

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరంలో 45 మంది, ద్వితీయ సంవత్సరం 50 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం సీఈసీ టాపర్‌గా కొత్తపల్లి గ్రామానికి చెందిన ఈడ్గి రేణుక 952 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం బైపీసీ మహ్మద్ దావుద్ 906 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం బైపీసీ 390మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు.

ఊట్కూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో స్వప్న 938 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా, తరుణ్ 932 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. మొదటి సంవత్సరంలో 62 మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 46 మంది ఉత్తీర్ణులయ్యారు. పులిమామిడి కేజీబీవీ కళాశాలలో మొదటి సంవత్సరం 66 మంది, ద్వితీయ సంవత్సరం 64 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

కృష్ణా: మండలంలోని హిందుపూర్ గ్రామ శివారులో గల కేజీబీవీ ఇంటర్ ద్వితీయ సంవత్సరం 9 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 34 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో అంకిత 836 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. బైపీసీలో ప్రకృతి 857 మార్కులు సాధించింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 83 శాతం, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 82 శాతం ఉత్తీర్ణత సాధించారు.

తగ్గిన ఇంటర్ ఉత్తీర్ణత శాతం

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 129 మంది విద్యార్థులు చదవగా మంగళవారం విడుదలయిన ఫలితాల్లో కేవలం 14 మంది విద్యార్థులు మాత్రమే పాసయ్యారు. రెండో సంవత్సరంలో 145 మందికి గాను 43 మంది విద్యార్థులు పాసయ్యారు. రెండో సంవత్సరంలో కోమల్ 948 మార్కులు, మొదటి సంవత్సరంలో నితిన్ 448మార్కులతో కళాశాల టాపర్లుగా నిలిచారు. అలాగే తెలంగాణ మోడల్ పాఠశాలలో మొదటి సంవత్సరం 39శాతం, రెండో సంవత్సరంలో 45శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. బైపీసీ విద్యార్థి నికిత 966 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. అలాగే కస్తూర్బా గాంధీ పాఠశాలలో బైపీసీలో 61శాతం, ఎంపీసీలో 45శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. సంయుక్త 963 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. అలాగే కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలలో మొత్తం 85.66శాతం విద్యార్థులు పాసయ్యారు. ఇందులో ఎంపీసీలో ప్రవీణ్‌కుమార్ 924మార్కులు సాధించారు.

ఇంటర్‌లో 95 శాతం ఉత్తీర్ణత...

దామరగిద్ద: మండలంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 139 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 69 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 104 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 99 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీరారెడ్డి

మద్దూరు: మండలంలోని నందిపాడ్‌లో సర్పంచ్ సైదమ్మతో కలిసి ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి మంగళవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసినా ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏ గ్రేడ్ వరి క్వింటాలు రూ.2060, బీ గ్రేడ్ వరికి రూ.2040 అందజేస్తుందన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

మక్తల్: పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని జక్లేర్‌లో చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులుతో పాటు ఈదురుగాలులు బలంగా వీచాయి. రైతు భగవంతుకు సంబంధించిన ఎద్దు మేత మేస్తుండగా అకస్మాత్తుగా పిడుగుపడటంతో ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

యువజన సంఘం మండల కమిటీ ఎన్నిక

ఊట్కూర్: మండలకేంద్రంలో బాబాసాహెబ్ యువజన సంఘం మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొక్కు శంకర్, ఉపాధ్యక్షుడు కొక్కు నర్సిములు, బక్కి తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి కొండన్ గోపాల్, సహాయ కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి లావరి బాలరాం, కార్యవర్గ సభ్యులు కపిల్, బాల్‌రాజ్, ప్రభాకర్, దుంప అశోక్, నరేశ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు దశరథ్, నర్సింగప్ప, నారాయణ, ఆర్. హన్మంతు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిమిస్తే చర్యలు



అమరచింత: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించి ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే డ్రైవర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ రత్నం అన్నారు. పట్టణ శివారులో వాహనాల తనిఖీలో భాగంగా పరిమితికి మించి వ్యవసాయ కూలీలను ఎక్కించుకున్న ఆటోను నిలువరించి డ్రైవర్‌ను హెచ్చరించారు. అత్యాశతో ప్రయాణికులను ఎక్కించుకుంటే జరగరాని ప్రమాదం జరిగితే కోల్పోయిన వారి జీవితాలను వెనక్కి తీసుకురాలేమన్నారు. ఈమేరకు వ్యవసాయ కూలీలతో సీఐ మాట్లాడుతూ పొలాల్లో కష్టపడి పని చేస్తున్న మీరు ఇలా ఇరుఇరుకుగా ఆటోల ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రైవేట్ వాహనాలను నడుపుతున్న డ్రైవర్లు కెపాసిటీకి మించి ప్రయాణికులను తమ వాహనాల్లో ఎక్కించుకున్నట్లు మరోమారు తమ తనిఖీలో కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెక్‌పోస్టుల్లో ఆకస్మిక తనిఖీలు


సమస్తాపూర్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న సీఐ


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రవిబాబు

నారాయణపేట: కర్ణాటక రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం నారాయణపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్, ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టులను సీఐ రవిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరిహద్దులో వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చెక్‌పోస్టుల్లో విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది, రెవెన్యూ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అక్రమంగా మద్యం, డబ్బు, చీరలు తదితర వస్తువులు ఏమైనా రవాణా చేస్తుంటే వాటిని పట్టుకోవాలని సూచించారు.

ఊట్కూరు: కర్ణాటక రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల సందర్భంగా సమస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను సీఐ సీతయ్య తనిఖీ చేశారు. పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండి వాహనాలను తనిఖీ చేయాలని, వాటి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

గండేడ్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లెబాటలో భాగంగా మంగళవారం గండేడ్ మండల పరిధిలోని పగిడ్యాల్, బల్సూర్‌గొండ, తువ్వగడ్డ తండా, పరుగుల తండా, పంచాంగాల్ తండా తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లను, వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పగిడ్యాల్‌లో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందని వారి అభివృద్ధి కోసం వివిధ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. తువ్వగడ్డ తండాకు బీటీ రోడ్డు వేయించాలని కోరాగా ఎమ్మెల్యే త్వరలోనే ఏర్పాటు చేయిస్తామన్నారు. కాగా కొండాపూర్‌లో సర్పంచ్ శ్రీనివాస్ ఏర్పాటు చేసిన సభా స్థలికి ఎంపీటీసీ బాలమ్మ వర్గీయులు రాలేదు. జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు


నిడుగుర్తిలో కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

ఊట్కూర్: మండలంలోని నిడుగుర్తిలో నాల్గో రోజు మంగళవారం కంటి వెలుగు శిబిరం కొనసాగింది. 450 మందికి కంటి పరీక్షలు చేశారు. 61 మందికి రీడింగ్ అద్దాలు, 51 మందికి కంటి చూపు అద్దాలను పంపిణీ చేశారు. 112 మందిని ఆపరేషన్ కోసం సిఫారసు చేశామని వైద్యురాలు శ్రీవిద్య తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మంజుల, లక్ష్మి, అమీర్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని సంగంబండలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ రాజు, ఎంపీటీసీ తిమ్మప్పలు ప్రారంభించారు. కార్యక్రమంలో కాచ్‌వార్ ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, ఉప సర్పంచ్ చెన్నకేశవరెడ్డి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?


బురద మయంగా మారిన ప్రధాన రహదారి

మాగనూర్: మండలంలోని వర్కూర్– నేరడగం ప్రధాన రహదారి బురదమయంగా తయారైంది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మట్టిరోడ్డు అడుగుతీసి అడుగువేయలేని దుస్థితి నెలకొంది. వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లేందుకు జంకుతున్నారు. కొందరు పనులు కూడా వాయిదా వేసుకుంటున్నారంటే దారి ఎలా ఉందో చెప్పనక్కర్లేదు. కొందరు బురదలో వాహనాలు అదుపు తప్పి కిందపడి ప్రమాదాల పద్దారని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న బురదను తొలగించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మక్తల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో టీఎస్ ఐడీసీ నుంచి మంజూరైన రూ.5 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించామన్నారు. నల్లజానమ్మ గుడిదగ్గర షెడ్డు, కమ్యూనిటీ హాల్, ఆరు హైమోస్ట్ విద్యుత్ దీపాలు, మినీ ట్యాంకుబండ్‌కు రూ.40 లక్షలు, తిరుమలయ్య చెరువుకు అభివృద్ధికి రూ.50 లక్షలు, మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.10 కోట్లు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఇప్పటివరకు మక్తల్‌కు కేంద్రం ప్రభుత్వం రూ.2.5 కోట్లు నిధులు ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వం రూ.7 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. మక్తల్‌లో 150 పడుకలు ప్రభుత్వ ఆస్పత్రిని మంజూరు చేశామన్నారు. సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్‌లు నర్సింహగౌడ్, రాజేష్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, పట్టణ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, కావలి శ్రీహరి, చిన్నహన్మంతు, నేతాజీరెడ్డి, ఈశ్వర్, శివారెడ్డి, బండారి ఆనంద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వాకిటి శ్రీహరి

నర్వ: మరికల్ మండలం రాకొండలోని చెక్‌డ్యాంలో నర్వ మండలం పాథర్చేడ్‌కు చెందిన ఇద్దరు బాలికల సోమవారం మృతి చెందారని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ దయాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాథర్చేడ్‌కు చెందిన పోతురాజు గజ్జలప్పకు చెందిన ఇద్దరు కుమార్తెలు శ్రావణి, మహేశ్వరీలు మృతి చెందడం బాధాకరమన్నారు. నారాయణపేట కలెక్టర్ మానవతా దృక్పథంతో ఆదుకోవాలని కోరారు. శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, వివేకవర్ధన్‌రెడ్డి, వెంకటేష్, పాథర్చేడ్ మహేష్, సంజీవరెడ్డి, అయ్యపురెడ్డి, రామన్‌గౌడ్, పాథర్చేడ్ గ్రామస్తులు ఉన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

మక్తల్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాలలు నిర్వహిస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నగర కార్యదర్శి వంశీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పిల్లలను పాఠశాలలో చేర్పించేటప్పుడు అన్ని అనుమతులు ఉన్నాయో లేదో తెలుసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినయ్, సురేష్, వినయ్, శరణ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు బ్యాంకు రుణాలు



అమరచింత: ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ కార్యక్రమంలో భాగంగా వీధి విక్రయదారులకు పీఎం స్వనిధి ద్వారా బ్యాంకు రుణాలను అందిస్తున్నామని మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్ తెలిపారు. పట్టణంలోని యూకోబ్యాంక్ మేనేజర్ శివశంకర్‌ను మంగళవారం కలిసి రెండో విడత వీధి విక్రయదారులకు బ్యాంకు రుణాల కోసం దరకాస్తు పత్రాలను అందించారు. ఇది వరకు రుణాలను స్వీకరించి క్రమం తప్పకుండా రుణాలను సకాలంలో చెల్లించిన వారికి మరోమారు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రూ.పదివేలు రుణం కోసం నలుగురు, రూ.20 వేల రుణం కోసం 11 మంది, రూ.50 వేల రుణం కోసం ఏడుగురికి బ్యాంకు రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. బ్యాంకు మేనేజర్ చొరవ చూపి త్వరితంగా రుణాలను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి




ఆత్మకూర్: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరాజు మంగళవారం మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈసందర్భంగా ఆత్మకూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని, సమస్యలు తలెత్తకుండ ఎప్పటికప్పుడు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కమిషనర్‌తో పాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ ఉన్నారు.

కమిషనర్‌కు సన్మానం...

ఆత్మకూర్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరాజును బీజేపీ నాయకులు సన్మానించారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో పాలు పంచుకుంటూ ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, నాగేందర్, విజయ్, వెంకట్, సమద్, చందు తదితరులు ఉన్నారు.

ఘనంగా సవరమ్మ జాతర



అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవరమ్మ దేవత జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయం ఎదుట పందిరి వేసి పూజలు ప్రారంభించిన ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఆలయంలోని మూల విరాట్‌లకు పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించారు. కుల, మతాలకు అతీతంగా గ్రామ దేవతగా పూజలందుకుంటున్న సవరమ్మ దేవతకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి కోళ్లు, కొబ్బరికాయలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వస్తున్న భక్తులకు అసౌకర్యం కలుగకుండా నీటి వసతితో పాటు అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకోనే అవకాశం కల్పించామని నిర్వాహకులు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యారెడ్డి, అరేందర్‌రెడ్డి తెలిపారు.

రేపు బ్రహ్మంగారి విగ్రహ ప్రతిష్ఠాపన



మక్తల్: మండలం మాద్వార్‌లో గట్టు తిమ్మప్ప దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామి విగ్రహాన్ని గురువారం ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం యజ్ఞం నిర్వహించారు. నూతన విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ ఇందిర, నిర్వాహకులు మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య, బాల్‌రాజ్, సత్యనారాయణ, వెంకటేష్, నరేష్, రవి కుమార్, అంజనేయులు, కృష్ణయ్య, విశ్వనాథ్, భక్తులు పాల్గొన్నారు.

తేలిక పాటి వర్షం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడమికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఈదరుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురవడంతో ప్రజలు కాసింత ఉపశమనం పొందారు. అయితే తేలికపాటి వర్షానికే కరెంట్ సరఫరా నిలిపివేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.


తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

నారాయణపేట టౌన్: అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని టీడీపీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు ఓం ప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో ధాన్యం తడిసి పంటనష్టం జరిగిన రైతులకు సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి ఎకరాకు రూ. 25 వేలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. లేనిపక్షంలో టీడీపీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

15 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

మద్దూరు: ఈ నెల 15 నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ విభాగాల్లో మండల స్థాయి క్రీడాపోటీలను నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడా పోటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15 ఏళ్ల నుంచి 36 సంవత్సరాల లోపు వయస్సుగల క్రీడాకారులు పాల్గొనవచ్చని వివరించారు. వివరాలకు 9985636508, 9393388439, 7893806725 నెంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నిడ్జింతలో కోట మైసమ్మకు బోనాలు



మద్దూరు: కొత్తపల్లి మండలంలో నిడ్జింతలో కోట మైసమ్మకు మంగళవారం బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రాజ్‌ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.